ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రంగారెడ్డి

5 జిల్లా వార్తలు

సోమవారం 3 ఫిబ్రవరి 2025

జాబ్‌మేళాకు 96మంది హాజరు

ఆదిభట్ల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల మున్సిపల్ కార్యాలయం వద్ద ఆదివారం ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఎలక్ట్రానిక్స్ కంపెనీ ఫ్యాక్స్‌కాన్ భాగస్వామ్యంతో జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాలో ఇబ్రహీంపట్నం మండలంలోని దండుమైలారం, ముకునూర్, రాయపోల్, లోయపల్లి, బడంగ్‌పేట్, ఆదిభట్ల మున్సిపల్ నుంచి 96 మంది యువతీ యువకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యులు పల్లె గోపాల్‌గౌడ్, కంపెనీ హెచ్‌ఆర్, సిబ్బంది శ్రీకాంత్, వినయ్, సందీప్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం

ఇద్దరు కేంద్ర మంత్రులుండి ఏం లాభం?

» ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీరని అన్యాయం చేశారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాలలో పార్టీలతో నిమిత్తం లేకుండా బడ్జెట్ కేటాయింపులు జరపాల్సి ఉన్నా.. కేవలం బీజేపీ పాలిత రాష్ట్రాలకు మాత్రం నిధులు కురిపించారని విమర్శించారు. ఈ మేరకు ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్రంలో ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఇతర పార్లమెంట్ సభ్యులు ఏం చేస్తున్నారో తెలియడం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా కేంద్ర మంత్రులను కలిసి తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి భారీగా నిధులు కేటాయించాలని కోరినా రూపాయి కూడా కేటాయించకపోవడం దురదృష్టకరమన్నారు. కనీసం రాష్ట్ర పునర్‌విభజన చట్టంలో రూపొందించిన అంశాలకు కూడా నిధులు కేటాయించకపోవడం శోచనీయమన్నారు. ఉపాధి లేక కూలీలు అవస్థలు పడుతుంటే ఉపాధిహామీ చట్టానికి నిధులు పెంచేదిపోయి తగ్గించడం సమంజసం కాదన్నారు. బడుగు బలహీన వర్గాల వారికి చేయూతనివ్వకుండా కార్పొరేట్ రంగానికి మాత్రం బడ్జెట్‌లో రెడ్ కార్పెట్ పరిచారని పేర్కొన్నారు. చిన్న రాష్ట్రాలను కేంద్రం తమ గుప్పిట్లో పెట్టుకొని భయభ్రాంతులకు గురిచేసేందుకే నిధులు కేటాయించలేదన్నారు.

అభివృద్ధి కోసమే ఎమ్మెల్యేల సమావేశం

ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు కేవలం తమ నియోజకవర్గాల అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యల గురించే సమావేశమయ్యారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మొదటిసారిగా ఎమ్మెల్యేగా అయిన వారే ఎక్కువగా ఉన్నందున జిల్లాను, తమ నియోజకవర్గాలను ఎలా అభివృద్ధి పరుచుకోవాలనే అంశంపైనే చర్చించుకున్నారని, దాన్ని ఒక పార్టీకి చెందిన సోషల్ మీడియా తప్పుడు ప్రచారం చేస్తుందన్నారు. సమావేశంలో ఎంఎస్ఎన్ కంపెనీ అధినేత కాంగ్రెస్ పార్టీ నేత జీవన్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ బాబర్‌అలీఖాన్‌తో పాటు పార్టీ నేతలు రఘు నాయక్, బాలరాజుగౌడ్, తిరుపతిరెడ్డి, గడ్డం శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయం.. అపవిత్రం! 7

రామలింగేశ్వరాలయం వద్ద జోరుగా మద్యం విక్రయాలు

తాగి చిందేస్తున్న మందుబాబులు



యాచారం మండలం ధర్మన్నగూడలో బోరు డ్రిల్లింగ్

వాల్టా పట్టా!

ఇష్టానుసారం బోర్ల తవ్వకాలు

నీటి అవసరాలు పెరిగిపోవడంతో జిల్లాలో బోరుబావులను ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ లెక్కకు మించి బోర్లు వేస్తున్నారు. దీంతో రోజురోజుకూ భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. వ్యవసాయ, గృహ అవసరాలకు బోర్లు వేసుకోవాలంటే రెవెన్యూ, భూగర్భ జల శాఖ అధికారుల అనుమతి తప్పనిసరి. కానీ బోరు వేసుకోవడానికి ఏ ఒక్కరూ దరఖాస్తు చేసుకున్న దాఖలాలు లేవు. రోజుకు జిల్లాలో పదుల సంఖ్యలో బోర్లు వేసుకుంటున్నా అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా చర్యలు తీసుకోకపోతే ముమ్మందు నీటి ఎద్దడి తప్పదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

- వాల్టా చట్టానికి తూట్లు
- పట్టించుకోని అధికారులు
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- 800 ఫీట్ల లోతుకు బోరు వేసినా కరుణించని గంగమ్మ
- అప్పుల పాలవుతున్న రైతన్నలు

రంగారెడ్డి అర్బన్/యాచారం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణాన్ని కాపాడి, భూగర్భ జలమట్టాలు పడిపోకుండా తీసుకునే జాగ్రత్తల్లో భాగంగా ప్రభుత్వం వాల్టా చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ చట్టం నిబంధనల ప్రకారం అనుమతి లేనిదే ఇసుక తీయరాదు, బోరు వేయరాదు. ఒక వేళ తప్పని పరిస్థితి వస్తే బోరు వేసేందుకు కనీసం 100 మీటర్ల దూరంలో మాత్రమే కొత్త బోరు వేయాలని నిబంధనలు చెబుతున్నాయి. కానీ.. జిల్లాలో పరిస్థితి చూస్తే వాల్టా చట్టం ఉందా.. లేదా అనే అనుమానాలు కలుగుతున్నాయి.



మేడిపల్లిలో ఎండిన చెరువు

వాగుల్లో ఇసుక తీయడం ఆగడం లేదు. విచ్చలవిడిగా బోర్ల వేయడం మానడం లేదు. పంటలు ఎండుతున్నాయని రైతులు ఇష్టానుసారంగా బోర్లు వేస్తూ అప్పులపాలవుతున్నారు. నీటి వాడకం విపరీతంగా పెరిగి పోవడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. వేసవి రాకముందే.. గంగమ్మ పాతాళంలోకి చేరింది. ఈ పరిస్థితి ఇలాగే ఉంటే.. భవిష్యత్‌లో నీటి ఎద్దడి తప్పదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

విచ్చలవిడిగా...

వర్షాలు సరిపడా కురవక పంటలను కాపాడుకోవడానికి రైతులు అధికంగా బోర్లు వేస్తున్నారు. అంతేకాకుండా గృహ అవసరాలకు యజమానులు, వెంచర్లలో రియల్టర్లు ఇష్టానుసారంగా బోర్లు వేయిస్తున్నారు. జిల్లాలో రోజుకు పాతిక సంఖ్యలో బోర్లు వేయడం జరుగుతుంది. అలాగే ఇసుక తీయడం.. బోరు వేయడం కారణంగా వాతావరణ సమతుల్యం దెబ్బతిని అనర్థాలకు దారి తీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. 2023-24 యాసంగిలో 1,30,907 ఎకరాలు సాగు చేయగా, 2024-25 యాసంగిలో 1,23,932 ఎకరాల్లో వరి, జొన్న, మొక్కజొన్న,

మిగతా 8వ పేజీలో...

2024 డిసెంబరు, జనవరిలో భూగర్భ జలాల వివరాలు (మీటర్లలో)

మండలం	డిసెంబర్	జనవరి	వ్యత్యాసం
అబ్దుల్లాపూర్‌మెట్	5.41	6.17	-0.76
ఆమనగల్లు	5.30	6.06	-0.76
బాలాపూర్	6.73	7.17	-0.44
చేవెళ్ల	9.14	10.23	-1.09
చౌదరిగూడెం	7.86	9.17	-1.31
ఫరూఖ్‌నగర్	6.84	7.08	-0.24
గండిపేట	9.87	10.08	-0.21
హయత్‌నగర్	10.95	12.44	-1.49
ఇబ్రహీంపట్నం	14.11	15.75	-1.64
కడ్తాల్	9.76	10.58	-0.81
కందుకూరు	6.72	7.69	-0.97
కేశంపేట	4.69	5.48	-0.79
కొందుర్గు	4.92	6.42	-1.50
కొత్తూరు	8.37	9.41	-1.04
మాడ్గుల	7.24	7.54	-0.30
మహేశ్వరం	9.74	10.09	-0.35
మంచాల	10.29	11.96	-1.67
మొయినాబాద్	7.87	8.76	-0.89
నందిగామ	4.90	4.70	-0.20
రాజేంద్రనగర్	8.33	8.70	-0.43
సరూర్‌నగర్	12.66	14.80	-2.15
శేరిలింగంపల్లి	12.59	13.97	-1.38
షాబాద్	9.19	11.45	-2.25
శంషాబాద్	8.36	8.80	-0.44
శంకర్‌పల్లి	8.45	9.77	-1.32
తలకొండపల్లి	12.43	12.98	-0.55
యాచారం	8.07	8.74	-1.75
మొత్తం	9.08	10.13	-1.05

ఇబ్రహీంపట్నంలో కరువు ఛాయలు

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మళ్లీ కరువు పరిస్థితులు క్రమంగా నెలకొంటున్నాయి. మూడేళ్లుగా ఆశించిన మేర వర్షాలు కురియకపోవడంతో చెరువులు, కుంటల్లోకి చుక్క నీరు చేరలేదు. అవి బీళ్లుగా మారడంతో రైతులు పశువులను మేపుకుంటున్నారు. భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్ల నుంచి నీరు కూడా తక్కువగా వస్తుంది. వేసిన వరి పంటను కాపాడుకునేందుకు అప్పులు చేసి మరీ బోర్లు వేయించుకుంటున్నారు. యాచారం మండలంలో వివిధ గ్రామాలలో వారం రోజుల వ్యవధిలో 25 బోర్లను వేయించారు. 600-800 ఫీట్ల వరకు బోరు వేసినా నీరు రాకపోవడం లేదు. దీంతో అప్పుల చేసి బోర్లు వేస్తున్న రైతులు లబోదిబోమంటున్నారు. ధర్మన్నగూడలో శ్రీశైలం అనే రైతు 565 ఫీట్ల మేర బోర్ వేస్తే కేవలం రెండు ఇంచుల నీరు వచ్చింది. ఈ నీరు ఎండాకాలంలో పంటలకు సరిపోతుందా లేదా అనే విషయంపై రైతు ఆందోళన చెందుతున్నాడు. అయ్యవారిగూడలో ఓ రైతు రెండున్నర లక్షల అప్పు చేసి 450 ఫీట్ల మేర బోర్ వేస్తే చుక్కనీరు రాకపోవడంతో అప్పులు మిగిలాయని వాపోయాడు.

'హలో మాదిగ.. చలో హైదరాబాద్'ను జయప్రదం చేయాలి

» ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు రావుగల్ల బాబు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మహేశ్వరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ కోసం ఈ నెల 7న నిర్వహించే 'హలో మాదిగ. చలో హైదరాబాద్' సదస్సును లక్ష డప్పులతో జయప్రదం చేయాలని ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు రావుగల్ల బాబు మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ మండల బాధ్యులు బక్కని రవి, మండలాధ్యక్షుడు ఎర్ర గణేష్ మాదిగల ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో వర్గీకరణ సాధన కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ జరిగితేనే 59 ఉపకులాలకు సమ న్యాయం జరుగుతుందన్నారు. అదే విధంగా దేశమంతా ఎస్సీ వర్గీకరణ న్యాయమేనని మద్దతు తెలుపుతుంటే కొందరు మాల సామాజిక వర్గానికి చెందిన స్వార్థపరులు మాత్రం వ్యతిరేకిస్తూ కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారని మండిపడ్డారు. 30 ఏళ్ల సుదీర్ఘ పోరాట ఫలితంగా సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూల తీర్పు ఇచ్చిందన్నారు. ఫిబ్రవరి 7న హైదరాబాదులో నిర్వహించే సభకు చీమల దండులా మాదిగలందరూ ఆట పాటలు, డప్పుల దరువులతో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు నవీన్, జంగయ్య, స్వామి, బాల్‌రాజ్, అర్జున్, మల్లేష్, శ్రీశైలం పాల్గొన్నారు.



కాంగ్రెస్ ఈగల్ కమిటీలో వంశీచంద్‌కు చోటు

ఆమనగల్లు , ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ ఎనిమిది మంది సభ్యులతో నూతనంగా ఏర్పాటు చేసిన అత్యున్నత ఎన్నికల నిపుణులు, సాధికారిత కమిటీలో కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్ రెడ్డికి చోటు లభించింది. ఏఐసీసీ కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నుంచి ఆదివారం ఈమేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాంగ్రెస్ ఈగల్ కమిటీలో తెలంగాణ నుంచి ఒకరికి అవకాశం కల్పించగా అది వంశీచంద్ రెడ్డికే దక్కింది. స్వేచ్ఛ, న్యాయ పూర్వక ఎన్నికలను పర్యవేక్షించేందుకు ఈ కమిటీని కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసింది. ఇప్పటికే సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానిత సభ్యునిగా కొనసాగుతున్న వంశీచంద్ రెడ్డికి.. ఈగల్ కమిటీలో మరో అవకాశం రావడం పట్ల కల్వకుర్తి నియోజకవర్గ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తనకు లభించిన ఈ అవకాశాన్ని బాధ్యతగా, సమర్థవంతంగా నిర్వహిస్తానని వంశీచంద్ రెడ్డి తెలిపారు.



కల్యాణం.. కమనీయం

దెబ్బడగూడలో వైభవంగా పార్వతీపరమేశ్వరుల పరిణయం



కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

కందుకూరు,ఫిబ్రవరి 2,(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దెబ్బడగూడ గ్రామంలో శివ రామాంజనేయ స్వామి దేవాలయ అష్టమ వార్షికోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా శనివారం రాత్రి పార్వతీపరమేశ్వరుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయం చైర్మన్ ఏనుగు జంగారెడ్డి ఆధ్వర్యంలో సాయంత్రం నుంచి రుద్రాభిషేకం, సీతారాములకు పుష్పాభిషేకం, ఆంజనేయస్వామి విగ్రహానికి అభిషేకాలు చేశారు. రాత్రి పార్వతీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చి కనుల పండువగా కల్యాణాన్ని జరిపించారు. అనంతరం దేవతామూర్తులను గ్రామంలోని పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఏనుగు లక్ష్మీచంద్రశేఖర్, ఎల్మటి లక్ష్మీదేవేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఏనుగు శ్రావణి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జిట్టు రాజేందర్‌రెడ్డి, నాయకులు ఎస్. భూమిరెడ్డి, మనోహర్, ఏనుగు జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్త, కొంతం జంగారెడ్డి, కె.సుధాకర్ రెడ్డి, ఐ.చంద్రశేఖర్‌రెడ్డి, కుమ్మరి సాంబయ్య, నీలం వెంకటేష్, పి.అంజయ్య, అచ్చుతారెడ్డి, ఎల్మటి అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇద్దరు కేంద్ర మంత్రులుండి ఒక్క రూపాయి తేలే..

» కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీసతీష్



మాట్లాడుతున్న భీంభరత్

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజలు బీజేపీకి ఓటు వేసి 8 మంది చొప్పున ఎమ్మెల్యేలు, ఎంపీలను గెలిపిస్తే, అందులో ఇద్దరూ కేంద్రమంత్రులయ్యారని. అయినా బడ్జెట్‌లో రాష్ట్రానికి ఒక్క రూపాయి తీసుకురాలేకపోయారని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీసతీష్ మండిపడ్డారు. ఆదివారం అజీజ్‌నగర్‌లోని భీంభరత్ నివాసంలో మండల అధ్యక్షుడు మానయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలుగింటి కోడలైన నిర్మలమ్మ రాష్ట్రంపై ప్రేమ చూపలేదని విమర్శించారు. కేంద్రంలో అందరితో పరిచయాలున్నాయని, అధిక నిధులు తీసుకువస్తానని చెప్పిన చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఇప్పుడు ఏం సమాధానం చెబుతాడని ప్రశ్నించారు. బీజేపీ కేవలం మత రాజకీయాలకే ప్రాధాన్యతనిస్తుందని, సామాన్య ప్రజలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఏపీ, బీహార్ రాష్ట్రాలకు బడ్జెట్‌లో అధిక నిధులు ఇవ్వడం చూస్తే కేంద్ర ప్రభుత్వం ఎక్కువ రోజులు నడవదనే ఆలోచన ప్రజల్లో నెలకొందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర మంత్రులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు అనేకసార్లు కలిసి వినతిపత్రాలు ఇచ్చిన మొండిచెయ్యి చూపించారని మండిపడ్డారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సంజీవరెడ్డి, బొలిగిద్ద సత్యనారాయణ, మర్రి రవీందర్‌రెడ్డి, కంజర్ల భాస్కర్, షురాణం వీరభద్రస్వామి, రాజేందర్ యాదవ్ ఉన్నారు.

కార్మికులను మోసగిస్తున్న కార్పొరేట్ సంస్థలు

» సీఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు



మాట్లాడుతున్న పర్వతాలు

శంషాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులను బడా కార్పొరేట్ సంస్థలు మోసగిస్తున్నాయని సీఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు ఆరోపించారు. శంషాబాద్‌లో ఆదివారం భవన నిర్మాణ కార్మికుల 3వ మహాసభ సీపీఐ మండల ఇన్‌చార్జి నర్రా గిరి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి పర్వతాలు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన మైగ్రేడ్ కార్మికులతో పాటు అడ్డా కూలీలకు సరైన వేతనం ఇవ్వకుండా బడా కంపెనీల యాజమాన్యం వేధింపులకు గురిచేస్తున్నాయన్నారు. అలాంటి కంపెనీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజు, నరేష్, యేసు, నర్సింహ్మ పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

» ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి



అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

శంకర్‌పల్లి, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయకుండానే సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి పోయి డబ్బా కొట్టడం ఆయనకే చెల్లిందని ఎద్దేవా చేశారు. ఆదివారం జన్వాడకు చెందిన బీజేపీ నాయకులు వెంకటేష్ తన అనుచరులతో కలిసి సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రానికి కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని అన్నారు. కేసీఆర్ హయాంలో అన్ని పథకాలను సమయానుకూలంగా అమలు చేశారని, ప్రస్తుత ప్రభుత్వం ఏ ఒక్క పథకం పూర్తి స్థాయిలో అమలు చేయలేకపోతుందని విమర్శించారు. జన్వాడను నార్సింగి మున్సిపాలిటీలో కలపడం వల్ల ఇక్కడ నివసించే పేదలకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని, ప్రభుత్వం దీనిపై పునరాలోచించాలని డిమాండ్ చేశారు. జన్వాడలో గౌడిచర్ల వెంకటేష్ తన సొంత డబ్బులు వెచ్చించి ఆడపిల్ల పుడితే రూ.16వేలు ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జాతీయ మీడియా అధికార ప్రతినిధి కార్తీక్‌రెడ్డి, దేశమొల్ల ఆంజనేయులు, నారాయణ, మాణిక్‌రెడ్డి, వెంకటేష్, నాగేందర్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, నాగేందర్‌గౌడ్. నాయకులు గౌడిచర్ల నర్సింహ, కేశం గోపాల్, అశోక్ ఉన్నారు.

ఆధ్యాత్మికతతోనే సంపూర్ణ జీవనం


మాట్లాడుతున్న భాస్కరయోగి

పరిగి,ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మానవులు ఆధ్యాత్మికతతో కలిగిన జీవితం పరిపూర్ణ లక్ష్యానికి కారణం అవుతుందని ఆధ్యాత్మికవేత్త డాక్టర్ పి.భాస్కరయోగి అన్నారు. భాస్కర ఫౌండేషన్-హిందూ ధార్మిక సమితి ఆధ్వర్యంలో ఆదివారం పరిగిలో జరిగిన మాఘ సంత్సంగంలో ఆయన ప్రసంగిస్తూ, వేదాలు, శాస్త్రాలు సూచించిన విధానంలో జీవించడమే సనాతన ధర్మం మూల సూత్రమని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక చింతన, విలువలు బోధించే సంత్సంగాల ద్వారా పరివర్తన చెంది పరిపూర్ణమైన విధానాన్ని పొందాలన్నారు. శాస్త్ర ఆధారంగా జీవన విధానంతోపాటు, సంప్రదాయాలను అనుసరిస్తే భగవంతుడి కరుణ ఉంటుందని, తద్వారా పరిపూర్ణ జీవితానికి అవకాశం ఉంటుందన్నారు. సామాజిక సమరత వేదిక కన్వీనర్ అప్పల ప్రసాద్ మాట్లాడుతూ, సామరస్యత కోసం ఎందరో మహనీయులు పాటుపడ్డారని, వారి అడుగుజాడల్లో నడుచుకోవాలని సూచించారు.

కాంగ్రెస్‌లోకి చేరికలు


ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

యాలాల, ఫిబ్రవరి 2, (ఆంధ్రజ్యోతి) : పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఆదివారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో చేరగా వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. చేరిన వారిలో యమునగారి చంద్రయ్య, మంగలి లోకేష్, నేతి బసప్ప, కుమ్మరి బాలప్పతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. కార్యక్రమంలో యాలాల పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, పగిడ్యాల ఏఎంసీ డైరెక్టర్ నర్సింహులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, మత్స్య కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, అగ్గనూరు వెంకటయ్య, భీమయ్య, కలాల్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


రాఘవాపూర్‌లో రక్తమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన పూజలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, నేతలు

రక్తమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

మండలంలోని రాఘవాపూర్‌లో రక్తమైసమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, నాయకులు హన్మంతు, రాఘవాపూర్ అమర్‌నాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అన్నసాగర్ సత్యనారాయణరెడ్డి, షైపాల్, శ్రీధర్ పాల్గొన్నారు.

చైన్‌స్నాచింగ్ పేరిట నాటకం

కూతురి ఆర్థిక ఇబ్బందులు తీర్చాలని తల్లి యత్నం

పోలీసుల రంగప్రవేశంతో అసలు విషయం వెలుగులోకి..

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కూతురి ఆర్థిక ఇబ్బందులు తీర్చాలని ఓ తల్లి చైన్‌స్నాచింగ్ నాటకం ఆడింది. పోలీసుల రంగప్రవేశంతో అసలు విషయం బట్టబయలైన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలోని అవుషాపూర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ అవుషాపూర్‌కు చెందిన చీమల లక్ష్మమ్మ(60) తన కూతురు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుంది. తన వద్ద ఉన్న నాలుగు తులాల బంగారు మంగళసూత్రం అమ్మి ఇద్దామనుకుంటే కొడుకుకు తెలుస్తుందని భావించింది. ఆదివారం ఉదయం 7 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి దుకాణానికి వెళ్తుండగా మెయిన్‌రోడ్డు వద్ద బంగారపు మంగళసూత్రాన్ని బైక్‌పై వచ్చిన గుర్తుతెలియని దుండగులు లాక్కెళ్లారంటూ కన్నీరు పెట్టుకుంటూ కొడుకుకు చెప్పింది. వెంటనే అతను 100కు డయల్ చేసి సమాచారం ఇచ్చాడు. ఇక్కడికి చేరుకున్న సీఐ పరుశురాం వెంటనే నాలుగు బృందాలను ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు చేపట్టారు. స్థానికంగా ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలిస్తే దుండగులకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదు. దీంతో అనుమానం వచ్చి ఆమెను విచారించగా అసలు విషయం చెప్పింది. తన కూతురుకు ఆర్థిక ఇబ్బందులున్నాయని, అందుకే నాటకమాడినట్లు తెలిపింది.

ఆలయ నిర్మాణానికి చేయూత

నందిగామ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మోత్కులగూడ లో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ దేవాలయానికి షాద్‌నగర్ పట్టణంలోని సాయిరాజ ఫంక్షన్‌హాల్ యజమాని సాయికృష్ణ ఆదివారం రూ.21వేల చెక్కును దేవాలయ కమిటీ సభ్యులకు అందజేశారు. సాయికృష్ణకు కృతజ్ఞతలు కమిటీ సభ్యులు తెలిపారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం


కరాటే పోటీలను హాజరై ప్రారంభించిన మునిసిపల్ మాజీ చైర్ పర్సన్ మంజుల

వికారాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కరాటే ఆత్మరక్షణగా దోహదపడుతుందని మునిసిపల్ మాజీ చైర్ పర్సన్ మంజుల రమేష్ అన్నారు. వికారాబాద్ క్లబ్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం 6వ నేషనల్ ఓపెన్ కరాటే కుంగ్ ఫూ చాంపియన్‌షిప్ 2025 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కరాటేలో విద్యార్థులను ప్రోత్సహిస్తున్న పీటీలకు, పీడీలకు, మాస్టర్లను అభినందించారు. నిర్వాహకులు ఖాజాపాషా మాట్లాడుతూ.. జాతీయస్థాయిలో జరిగే ఈ పోటీల్లో మహారాష్ట్ర, కర్ణాటక, వెస్ట్ బెంగాల్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి 800 మంది విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారని తెలిపారు. ఇందులో ఎక్కువగా బాలికలే ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రమేష్‌కుమార్, మాలే లక్ష్మణ్, దీప, సర్వరాజ్, సందీప్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో తరించాలి



బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానంలో నిర్వహించే శ్రీవారి సేవకు వెళ్లి తరించాలని టీటీడీ ఆర్గనైజర్ చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. మండలంలోని రేగడిమైలారంలో ఆదివారం టీటీడీ సేవకు వెళ్లే సేవకులతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈనెల 4న కుమ్మరి వెంకటయ్య బృందం 15 మంది, 24న దాసరి రాములు బృందం 12మంది, నెల్లి అంజిలయ్య బృందం 15 మంది శ్రీవారి సేవకు బయల్దేరనున్నారు. వారం రోజుల పాటు శ్రీవారి సేవలో ఉంటూ టీటీడీ భక్తులకు సేవలందించనున్నారు. 40 ఏళ్లుగా శ్రీవారి సేవకు సేవకులను తరలిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఘనంగా భక్తమార్కండేయ జయంత్యుత్సవాలు



డోలారోహణంలో మహిళలు

ఆమనగల్లు , ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భక్తమార్కండేయ స్వామి దేవాలయంలో స్వామి వారి జయంతిని అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. మహిళా సంఘం ఆధ్వర్యంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా భక్తులకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం డోలారోహణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘ సభ్యులు అప్పం అలివేలు, అప్పం శ్రీలత, ఉదయశ్రీ, హేమలత, కల్పన, వనజ, రాజ్యలక్ష్మి, సుని, దేవాలయ అధ్యక్షుడు ఎంగలి బాలకృష్ణ, నాయకులు అప్పం శ్రీను, ఈశ్వరయ్య, గిరి, సత్యరాములు, ఆంజనేయులు, భాస్కర్, శ్రీను, శివ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు



ఆలయంలో గౌడ సంఘం నాయకులు

ఆమనగల్లు , ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కంఠమహేశ్వర స్వామి దేవాలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన పబ్బంతి ఆంజనేయ స్వామి, రేణుక ఎల్లమ్మ, మైసమ్మ, నవగ్రహాలు, కౌండిన్యమహర్షి ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు ఆదివారం వైభవంగా ముగిశాయి. నాలుగు రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ చుక్క అల్లాజీగౌడ్, ప్రధాన కార్యదర్శి గంగ రవీందర్‌గౌడ్, గౌడ సంఘం మండల అధ్యక్షుడు చుక్క నిరంజన్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. వేడుకలకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, చల్లా వంశీచంద్‌రెడ్డి, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్‌లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతలు, ఉత్సవ కమిటీ సభ్యులకు అల్లాజీ గౌడ్, రవీందర్ గౌడ్‌ల ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో నారాయణ గౌడ్, యాదయ్యగౌడ్, బాలకృష్ణ గౌడ్, వెంకటయ్య, సతీష్, యాదయ్య, నరేశ్ గౌడ్, కుమార్, అల్లాజీ, మోహన్, శివ, శ్రీను, నర్సింహ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ఆలయంలో పూజలు చేస్తున్న ఆలయ నిర్వాహకులు, నాయకులు

ఆమనగల్లు ,ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధి గాంచిన ఆమనగల్లు మండలం శెట్టిపల్లి గ్రామ అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజులపాటు కనుల పండువగా కొనసాగే బ్రహ్మోత్సవాల కోసం ఆలయాన్ని తోరణాలు, పుష్పాలతో శోభాయామానంగా అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం స్థానిక మాజీ సర్పంచ్ గోదాదేవి సత్యం, ఆలయ చైర్మన్ సింగిని శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. తొలిరోజు అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామికి సుప్రభాత సేవతో అర్చకులు మొల్గారి నవీన్‌శర్మ, గూడ కృష్ణమాచార్యులు మేలుకొలుపు పాడారు. అనంతరం విశ్వక్‌సేన ఆరాధన, పుణ్యహవాచనం, దేవత ఆహ్వానం, అంకుర్పారణ, ధ్వజారోహణం, బలిహరణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ప్రజలు, భక్తులు పాల్గొని పూజలు చేశారు. సోమవారం స్వామివారి కల్యాణం క్రతువు జరుపుతారు. కార్యక్రమంలో ,నాయకులు, అర్చకులు ,భక్తులు తదితరులు ఉన్నారు.

గ్రామాల బాగుతోనే దేశాభివృద్ధి

- జిల్లా దిశా కమిటీ సభ్యుడు నందు
- ఎంపీ నిధులతో పనులు ప్రారంభం



పనుల ప్రారంభం అనంతరం స్వీట్ తినిపించుకుంటున్న నాయకులు

మొయినాబాద్/మోమిన్‌పేట్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాల బాగుతోనే దేశ అభివృద్ధి సాధ్యపడుతుందని, ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి చేవేళ్ల పార్లమెంట్ పరిధిలోని గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరుచేస్తున్నారని జిల్లా దిశా కమిటీ సభ్యుడు, బీజేపీ జిల్లా కో ఆర్డినేటర్ వడ్ల నందు, దిశా కమిటీ చైర్మన్ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మోమిన్‌పేట్ మండలం మేకవనంపల్లిలో రూ.50 లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. మొట్టమొదటి సారిగా గ్రామానికి ఎంపీ నిధులు మంజూరు చేయగా పనులను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అశోరెడ్డి, జేకేఎంఆర్ ఫౌండర్ రాములు, మోమిన్‌పేట్ మండల మాజీ అధ్యక్షుడు భుజంగరెడ్డి, లక్ష్మారెడ్డి, సంగారెడ్డి, విఠలస్వామి, మల్లేశ్ యాదవ్, ఎర్రోళ్ల లక్ష్మయ్య శ్రీశైలం గౌడ్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత్ ఉత్సవ్



సత్యధామంలో నిర్వహిస్తున్న సంగీత కచేరి

మర్పల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మర్పల్లి మండలం బిల్కల్‌లో కొలువ దీరిన సత్యనారాయణస్వామి సత్యధామంలో శనివారం రాత్రి సంగీత్ ఉత్సవ్-2025 అందరినీ అలరించింది. నేటి తరానికి ఆధ్యాత్మికతతో పాటు సంస్కృతీ సంప్రదాయాలపై కనీస అవగాహన కల్పించాలన్న సంకల్పంతో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ వ్యవస్థాపకులు దుర్గప్రసాద్ ఆధ్వర్యంలో కేరళకు చెందిన ప్రముఖ సంగీత విద్వాంసులు ప్రిన్స్ రామవర్మ బృందం కచేరి కొనసాగింది. రామవర్మ గీతాలాపన చేయగా, వయోలిన్ అవనీశ్వరం ఎస్ఆర్ వినూ, మృదంగం హరికుమార్, ఘటం డాక్టర్ ఎస్ కార్తీక్ వాయించారు. నాలుగు గంటల పాటు కొనసాగిన కచేరిని వీక్షించేందుకు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలి వచ్చారు. కార్యక్రమానికి మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్, రేరా చైర్మన్ సత్యనారాయణ, హైకోర్టు న్యాయవాదులతో పాటు హైదరాబాద్‌కు చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

ఆలయం.. అపవిత్రం!

- రామలింగేశ్వరాలయం వద్ద జోరుగా మద్యం విక్రయాలు
- తాగి చిందేస్తున్న మందుబాబులు
- ఆలయ పవిత్రతకు విఘాతం
- దెబ్బతింటున్న భక్తుల మనోభావాలు
- చోద్యం చూస్తున్న సంబంధిత అధికారులు

షాద్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): 'రామేశ్వరం వెళ్లినా శనేశ్వరం' వదలదన్నట్లు ఫరూక్‌నగర్ మండలంలోని రామేశ్వరంలోని రామలింగేశ్వరాలయం మందుబాబుల వీరంగాలతో అపవిత్రంగా మారుతోంది. చుట్టుపక్కల మద్యం, కల్లు విక్రయాలు జరుగుతుండడంతో ఆలయ పవిత్రతకు విఘాతం కలుగుతున్నది. ఆలయ పరిసరాలను ఆనుకుని ఉన్న ఇళ్లలో అక్రమంగా మద్యం, కల్లు ప్యాకెట్లు విక్రయిస్తున్నారు. వాటిని కొన్న మందుబాబులు ఆలయ పరిసరాల్లోకి వెళ్లి తాగి చిందులేస్తున్నారు. సాయంత్రం కాగానే భక్తుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరిస్తున్నారు. కొందరి స్వార్థంతో నిత్యకృత్యంగా మారుతున్న ఈ వ్యవహారంపై దేవాదాయశాఖ అధికారులు, ఎక్సైజ్‌శాఖ అధికారులు, గ్రామ ప్రజాప్రతినిధులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వచ్చే మహాశివరాత్రి ఉత్సవంలో మద్యం, కల్లు, మాంసం విక్రయాలు జరగకుండా ముందునుంచే నిఘా ఉంచాలని భక్తులు కోరుతున్నారు.



రామేశ్వరంలోని రామలింగేశ్వరాలయం



రామలింగేశ్వరాలయ పరిసరాల్లో మద్యం సీసాలు, కల్లు ప్యాకెట్లు

ఎక్సైజ్ శాఖకు ఫిర్యాదు చేస్తా..

రామేశ్వరాలయం పరిసరాల్లో మద్యం, కల్లు విక్రయాలు జరగకుండా కట్టడి చేయడానికి ఎక్సైజ్‌శాఖ, పోలీసుశాఖ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తా. పుణ్యక్షేత్రంలో ఎలాంటి మత్తు పదార్థాలు, మాంసం విక్రయించడానికి ఏ మాత్రం వీలు లేదు. మద్యం తాగినా.. మాంసాహారం భుజించినా ఆలయ ప్రవేశం లేదు.

- శివకుమార్, ఆలయ ఈఓ

చట్టపర చర్యలు తప్పవు

పవిత్ర పుణ్యక్షేత్రమైన రామేశ్వరంలో మద్యం, కల్లు విక్రయాలకు ఎలాంటి అనుమతులు లేవు. చట్ట విరుద్ధంగా మద్యం, కల్లు విక్రయించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. సాధారణ రోజులతోపాటు జాతర సమయంలో కూడా మద్యం, కల్లు విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం.

- శేఖర్, ఎక్సైజ్ సీఐ



ధర్నాలో మాజీ జెడ్పీటీసీ బొక్క, జంగారెడ్డి, కాంగ్రెస్ నేతలు

బడ్జెట్ కేటాయింపులో వివక్ష తగదు

కందుకూరు,ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్రం పట్ల వివక్ష చూపడం సరికాదని మాజీ జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి అన్నారు. ఆ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం సాయంత్రం కాంగ్రెస్ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డితో పాటు పార్టీ నేతలతో కలిసి ఆయన నగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న ధర్నాకు తరలివెళ్లా రు. సంక్షేమ పథకాలను విమర్శిస్తున్న బీజేపీ ఎంపీలు కేంద్ర బడ్జెట్‌పై ఎందుకు మౌనంగా ఉన్నారని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకటేష్ గౌడ్, ఢిల్లీ శ్రీధర్, విష్ణువర్ధన్‌రెడ్డి, వీరారెడ్డి, వత్సుల నారాయణ పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

తాండూరు రూరల్, ఫిబ్రవరి 2, (ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణించాలని ఆర్పీఎల్ సీఈవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని కరన్‌కోట్‌లో డాక్టర్ వికాస్ స్మారక క్రికెట్ పోటీలు జరిగాయి. ఈ పోటీల ముగింపు సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడలతో ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. వాటిని ప్రోత్సహించి ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించాలన్నారు. డాక్టర్ వికాస్ పేరిట క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన జట్టుకు కప్‌ను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాజ్‌కుమార్, మాజీ ఎంపీపీ శరణుబసప్ప, కాంగ్రెస్ నాయకులు అనిల్ పాల్గొన్నారు. అంతకుముందు ఆర్పీఎల్ శ్రీనివాస్‌రెడ్డిని నాయకులు మాజీ ఎంపీటీసీ కె.నర్సయ్య గౌడ్ శాలువాతో ఘనంగా సన్మానించారు.

కరాటేలో విద్యార్థుల సత్తా

దుద్యాల: మహబూబ్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఎంపీ కప్ ఓపెన్ కరాటే అండ్ కుంగ్‌ఫూ చాంపియన్ షిప్‌లో దుద్యాల మండల విద్యార్థులు ప్రతిభ చాటారు. బొంరాస్‌పేట్ మండలంలోని కేజీబీవీ చెట్టుపల్లి తండా పాఠశాల విద్యార్థినులు శిరీష, నిఖిత బంగారు పతకాలు సాధించగా అనిత, శివానీ, సోనాలి, ఆద్య వెండి పతకాలు, నందిని, వైశాలీ, గాయత్రి, మీనాక్షి రజత పతకాలు సాధించారు. అలాగే దుద్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన అభినయశ్రీ బంగారు పతకం, సంధ్యారాణి, అక్షిత రజత పతకాలు సాధించారు. హస్నాబాద్ నేతాజీ పాఠశాల విద్యార్థిని కీర్తిక బంగారు పతకం సాధించింది. వీరిని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.



విజేత జట్టుకు కప్‌ను అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

బాడీబిల్డింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థికి సన్మానం

యాలాల: పాత తాండూరుకు చెందిన అభిషేక్ హైదరాబాద్ మల్లాపూర్‌లో జరిగిన నేషనల్ బాడీబిల్డింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. ఈ సందర్భంగా యాలాల మండల పీఆర్టీయూ అధ్యక్షుడు సి.కృష్ణారెడ్డి, జనరల్ సెక్రెటరీ రాములు, వ్యాపారవేత్త చాట్ల విశ్వనాథ్‌లు అభిషేక్‌ను ఆదివారం సన్మానించారు. మెన్స్ ఫిజిక్ విభాగంలో మొదటి, మూడో బహుమతి సాధించడం అభినందనీయమన్నారు.

నిధుల సాధనలో

బీజేపీ ఎంపీలు విఫలం

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్



ధర్నాలో కాంగ్రెస్ నాయకులు

మహేశ్వరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : కేంద్రం ఏ మాత్రం రాష్ట్రానికి బడ్జెట్‌ను కేటాయించలేదని మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, దేప భాస్కర్‌రెడ్డి, బొక్క జంగారెడ్డిలు అన్నారు. తెలంగాణ నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఉన్నారని, అయినా నిధులు తేవడంలో వారు పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఆదివారం నగరంలోని ట్యాంక్‌బండ్ వద్ద కాంగ్రెస్ చేపట్టిన ధర్నాకు మహేశ్వరం నియోజకవర్గం పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో నందిగామ నర్సింహా, వెంకటేష్‌గౌడ్, రాజునాయక్, రవి, లాజర్, ప్రవీణ్, శ్రీధర్, శివ, వంశీ రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

కేంద్ర మంత్రి రాందాస్



శంషాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ బీసీ, మైనార్టీ, క్రిష్టియన్ల అభ్యున్నతికి కృషి చేస్తామని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఏ) జాతీయ నాయకుడు కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే అన్నారు. శంషాబాద్‌లోని ఎంఎంఆర్ గార్డెన్‌లో ఆదివారం ఆ పార్టీ క్రిష్టియన్ మైనార్టీ వింగ్ ఆలిండియా అధ్యక్షుడు డాక్టర్ జాన్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కేంద్ర మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. అంబేడ్కర్ ఆశయాలు సాధిస్తామని, జైభీం అంటూ ఏపీ, తెలంగాణలో కూడా తమ పార్టీ కార్యకలాపాలను విస్తరిస్తున్నామన్నారు. అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాడుతామన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలు కేంద్ర మంత్రిని గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ జాన్, వెంకటేశ్వర్లు, బ్రహ్మానంద రెడ్డి, పీ.రవి, పద్మ పాల్గొన్నారు.

న్యాయపోరాటంతోనే ప్లాట్లు సాధించుకుంటాం


హైకోర్టు న్యాయమూర్తి జుబేర్ అక్రం



మాట్లాడుతున్న జుబేర్ అక్రం

మహేశ్వరం రూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : ఏకశిలనగర్ ప్లాట్స్ ఓనర్స్ వైపే న్యాయం ఉందని, న్యాయ పోరాటంతోనే ప్లాట్లు సాధించుకుంటామని హైకోర్టు న్యాయవాది జుబేర్ అక్రం తెలిపారు. పోచారం మున్సిపాలిటీ, కొర్రెముల ఏకశిలనగర్ ప్లాట్స్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏకశిలనగర్‌పై కేసులన్నింటిలోను ప్రత్యర్థి అలూరి వెంకటేష్ ఓడిపోయాడని చెప్పారు. న్యాయం తమవైపే ఉందని అసోసియేషన్ సభ్యులకు తెలిపారు. ప్లాట్స్ ఓనర్స్ ఎల్ఆర్ఎస్ ఉన్నవాళ్లు మున్సిపాలిటీ అనుమతితో ఇళ్లు నిర్మించుకోవచ్చని తెలిపారు. అయితే రాజకీయ, ధనబలంతోనే వెంకటేష్ తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఎన్ని కుయుక్తులు పన్నిన తామే విజయం సాధిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్లాట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మాణిక్యాల్ రావు, ఉపాధ్యక్షుడు శివారెడ్డి, విజయసేనారెడ్డి, ముత్తారెడ్డి, శ్రీనివాస్, అమీర్ అక్రం, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర నిధులతో గ్రామాల అభివృద్ధి



సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న బీజేపీ జిల్లా కార్యవర్గసభ్యులు దొడ్డ సందీప్‌కుమార్

పెద్దేముల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర నిధులతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు దొడ్డ సందీప్‌కుమార్ అన్నారు. మండలంలోని మంబాపూర్‌లో ఆదివారం రూ.2లక్షల ఎంపీ నిధులతో చేపట్టిన సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో గ్రామాలన్ని అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ప్రజలు కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు నరేందర్, బీజేపీ సీనియర్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, దస్తప్ప, దాస్, భీమప్ప పాల్గొన్నారు.

ఏ ముఖం పెట్టుకొని వస్తారు?

- కొడంగల్‌ను దత్తత తీసుకొని మీరేం చేశారు?
- కేటీఆర్‌ను నిలదీసిన కాంగ్రెస్ నాయకులు



మాట్లాడుతున్న కాంగ్రెస్ మండల నాయకులు

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేటీఆర్ బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో కొడంగల్‌ను దత్తత తీసుకొని ఏం చేశావని కాంగ్రెస్ మండల నాయకులు ప్రశ్నించారు. ఆదివారం బొంరాస్‌పేట్‌లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్ మాట్లాడుతూ ఐదేళ్ల కొడంగల్‌ను దత్తత తీసుకొని ఏం చేశావని ప్రశ్నించారు. ప్రశాంతంగా ఉన్న కొడంగల్‌లో అలజడి రేపేందుకు వస్తావా అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి చొరవతో కొడంగల్ నియోజకవర్గం రాష్ట్రంలోనే అభివృద్ధిలో దూసుకెళ్తుందన్నారు. ఈ నియోజకవర్గానికి అభివృద్ధి నిరోధకుడిగా ఏ ముఖం పెట్టుకొని వస్తావని అన్నారు.

పుచ్చ సాగు.. లాభాలు బాగు

- యాసంగిలో రైతులు ఆసక్తి
- ఎకరా పెట్టుబడి రూ. 80 వేలు
- లాభం రూ. లక్ష నుంచి లక్షన్నర
- ఈ పోషకాల ఫలానికి గిరాకీ ఎక్కువే

మర్పల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పుచ్చ పంటను రైతులు సాగు చేస్తున్నారు. ఆరోగ్యంతోపాటు ఆదాయం కూడా లాభసాటిగా మారడమేనని తెలుస్తోంది. మరోవైపు తక్కువ సమయంలోనే పంట చేతికి వస్తుంది. మహాశివరాత్రి సందర్భంగా దీక్షా కార్యక్రమాలతో పాటు వేసవి సమీపిస్తుండటం కూడా కలిసివస్తుంది. మార్కెట్లోనూ గిరాకీ ఉండటంతో సాగు చేపట్టేందుకు ఆసక్తిని కనబరుస్తున్నారు. ఆ మేరకు కథనం..

మర్పల్లి మండలం దామస్తాపూర్, మర్పల్లి, సిరిపూరం గ్రామాలతో పాటు పలు గ్రామాల కొంత మంది రైతులు 20 ఎకరాల్లో పుచ్చ సాగు చేస్తున్నారు. పెట్టుబడి ఎకరానికి రూ.60 వేల నుంచి రూ.80వేల వరకు ఖర్చు చేస్తున్నారు. పంట 80 నుంచి 90 రోజుల్లో చేతికి వస్తుంది. ఎకరానికి 20 నుంచి 25 టన్నుల దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు. కేజీ ధర 10 రూపాయల చొప్పున పంట విక్రయిస్తే రూ.లక్ష నుంచి లక్షన్నర వరకు లాభ వస్తుందని చెబుతున్నారు. అయితే అధిక డిమాండ్ ఉంటే కిలో రూ.30 నుంచి రూ.40 వరకు విక్రయిస్తారు. ఎండల ప్రారంభంలోనే శివరాత్రి పండుగ ఉంది. ప్రజలు ఉపవాస దీక్షలతో సాయంత్రం పుచ్చకాయలు తినేందుకు ఆసక్తి కనబరుస్తారు. అయితే నవంబరు, డిసెంబర్‌లో సాగు చేస్తే ఫిబ్రవరిలో చేతికి వస్తుందని రైతులు చెబుతున్నారు.






దామస్తాపూర్‌లో సాగు చేస్తున్న పుచ్చ పంట, ఏపుగా కాసిన కాయలు

లాభాలు ఎన్నో

పుచ్చకాయలో 80 శాతం నీటి శాతం ఉండటంతో వేసవి తాపం నుంచి ప్రజలకు ఉపశమనంతో పాటు రక్తహీనతను తగ్గించేందుకు దోహదపడుతుంది. కాయలు ఫ్రిజ్‌లో నిల్వ ఉంచకుండా తింటే పోషకాలు లభిస్తాయని, ఒకవేళ నిల్వ చేస్తే ఇవి తగ్గుతాయని వైద్యులు తెలిపారు. ఎప్పటికప్పుడు తాజా కాయలను తింటే ఆరోగ్యానికి మేలు జరుగుతుందన్నారు.

మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం

- లక్ష్మి మెగా సెంట్రల్ సిటీ మెగావెంచర్‌కు ఆదరణ
- అధ్యక్షకార్యదర్శులు రాంచంద్రన్, సతీష్‌కుమార్



మాట్లాడుతున్న రాంచంద్రన్, సతీష్‌కుమార్

కొత్తూర్, ఫిబ్రవరి 2: (ఆంధ్రజ్యోతి) కొత్తూర్, నందిగామ మండలాల్లో ఏర్పాటు చేసిన లక్ష్మి మెగా సెంట్రల్ సిటీలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి సభ్యులు నడుం బిగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్లాట్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామచంద్రన్, ప్రధానకార్యదర్శి సతీష్‌కుమార్‌లు పిలుపునిచ్చారు. ప్లాట్ల యాజమానుల అసోసియేషన్ 4వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నందిగామలో ఉన్న లక్ష్మి మెగా సెంట్రల్ సిటీ లేఅవుట్‌లో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంచర్‌లో విద్యుత్, మంచినీటి సరఫరా, మురుగునీటి కాలువల నిర్మాణ సమస్యలను గుర్తించామన్నారు. వాటిని పరిష్కరించేందుకు సభ్యులు సహకారం అందించాలన్నారు. అసోసియేషన్‌లో చేరని ప్లాట్ల యాజమానులు వెంటనే సభ్యత్వాలు తీసుకోవాలని సూచించారు. వెంచర్‌లో చేపట్టే అభివృద్ధి పనుల గురించి సభ్యులకు తెలిపారు. రాష్ట్ర రాజధానికి, అంతర్జాతీయ విమానాశ్రయానికి అతి చేరువలో ఉన్న మెగావెంచర్ దినాదినాభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి ప్రసాద్, ఉపాధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే యాదయ్యను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

ఆర్యవైశ్యుల సంఘం అభివృద్ధికి తోడ్పాటు

చేవెళ్ల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఆర్య వైశ్యుల సంఘం అభివృద్ధికి తోడ్పాటునందిస్తామని ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. చేవెళ్ల మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు ఎమ్మెల్యేను ఆదివారం చించల్‌పేట్‌లో అయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. సంఘం అధ్యక్షుడు, దామరిగిద్ద మాజీ సర్పంచ్ మలిపెద్ది వెంకటేశం గుప్తా, మాజీ సర్పంచ్ రెడ్డిశెట్టి మధుసూదన్‌గుప్తా, ఆర్యవైశ్య సంఘం నాయకులు రెడ్డిశెట్టి శ్రీనివాస్‌గుప్తా, మందుముల ప్రభుగుప్తా, కుంచం నవీన్‌కుమార్‌గుప్తా, కృష్ణగుప్తా, విజయ్, అరుణ్ తదితరులు ఉన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన లక్ష్మీనివాస్

తలకొండపల్లి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి రాందాస్ అథవాలేను లింగరావుపల్లికి చెందిన టీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ శంషాబాద్‌లో కలిశారు. మంత్రిని సన్మానించినట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేత

నందిగామ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): క్రీడలతో ఆరోగ్యం లభిస్తుందని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. నందిగామ మండల కేంద్రంలో 15 రోజులుగా మాజీ ఎంపీటీసీ కొమ్ము కృష్ణ సహకారంతో నిర్వహిస్తున్న నందిగామ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా విజేతలకు ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్‌లు స్థానిక నాయకులతో కలసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, నర్సింలు, పాండురంగారెడ్డి, మల్లేష్, వెంకట్‌రెడ్డి, అంజయ్య, సుమన్, జంగయ్యగౌడ్, లింగం, ప్రభయ్య నిర్వాహకులు కరుణాకర్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి, మనోజ్‌రెడ్డి, దార శ్రీను, సూరి, ప్రవీణ్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.


నందిగామ : ట్రోఫీ గెలుపొందిన క్రీడాకారులతో ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి


కొందుర్గు : ట్రోఫీ అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

గెలుపోటములను సమానంగా భావించాలి

చౌదరిగూడ : ఆటల్లో గెలుపోటములను సమానంగా భావించాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. కొందుర్గు మండల పరిధిలోని ఆగిర్యాలలో సీజన్-2 క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు రూ.30 వేల నగదుతో పాటు ట్రోఫీని అందజేశారు. షాద్‌నగర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ నటరాజన్, మండలాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, రామకృష్ణ, విజయ్, లింగం, శేఖర్ వెంకటేష్, ప్రేమ్ కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

కొత్తూర్ : మున్సిపాలిటీలోని తిమ్మాపూర్ గ్రామంలో కౌన్సిలర్లు కోస్గి శ్రీనివాస్, చింతకింది చంద్రకళా రాజేందర్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో తిమ్మాపూర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ఆదివారం ప్రారంభించారు. విద్యార్థులు విద్యతో పాటు, క్రీడల్లో రాణించాలని కౌన్సిలర్లు పిలుపునిచ్చారు. క్రీడాకారులకు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వన్నాడ శివశంకర్ గౌడ్ క్రీడాకారులకు ఉచితంగా జర్సీలను అందజేశారు. నాయకులు రణధీర్‌గౌడ్, నర్సింహ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.


కొత్తూర్ : టోర్నీని ప్రారంభిస్తున్న కౌన్సిలర్లు శ్రీనివాస్, చంద్రకళా రాజేందర్‌గౌడ్

క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట

యాచారం : క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, క్రీడాకారులకు తన వంతు సహకారమందించి ఆదుకుంటామని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి చెప్పారు. అయ్యవారిగూడలో ఏపీఎల్ సీజన్-5 క్రికెట్ పోటీలను ప్రారంభించారు. యాచారం మండల కేంద్రానికి చెందిన అక్షిత అథ్లెటిక్స్‌లో గోల్డ్‌మెడల్ సాధించడం అభినందనీయమన్నారు. మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, మాజీ ఉపసర్పంచ్ మహేందర్‌యాదవ్, బాలశివుడు, లింగం, శేఖర్, కార్తిక్, భరత్‌రెడ్డి, కర్ణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


యాచారం : పోటీలు ప్రారంభిస్తున్న అభిషేక్‌రెడ్డి

క్రైం కార్నర్

గుర్తుతెలియని వ్యక్తి మృతి



షాద్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. సుమారు 50 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి గత నెల 24న ఎలికట్ట శివారులో అచేతనంగా పడి ఉండగా స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది అతడిని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించినట్లు చెప్పారు. అయితే, అతడు చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడని, మృతుడి ఆచూకీ తెలిసినవారు పోలీస్‌స్టేషన్ నెంబర్ 87126-63329ను సంప్రదించాలని కోరారు.


ఆందోళన చేస్తున్న సీఐటీయూసీ నాయకులు

జీవో ప్రకారం వేతనాలివ్వాలి

చేవెళ్ల, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని సీఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్ తెలిపారు. ఈమేరకు ఆదివారం చేవెళ్ల మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు జీవో 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో చాలా కాలంగా పని చేస్తున్నవారిని పర్మనెంట్ చేయాలన్నారు. కార్మికులకు అండగా సీఐటీయూసీ అండగా ఉంటుందన్నారు. సంఘం నాయకులు, ఎల్లయ్య, నరేష్, దస్తగిరి, జనార్దన్, నర్సింహ, కిష్టయ్య, బుచ్చయ్య, యేసయ్య, వెంకటయ్య, మల్లయ్య, లక్ష్మి తదితరులు ఉన్నారు.

(5వ పేజీ తరువాయి)

వాల్టా.. పల్టా!

శనగ, వేరుశనగ, కుసుమ, పొద్దుతిరుగుడు, ఆముద, ఇతర పంటలను సాగు చేశారు. అత్యధికంగా వరి పంటలను సాగు చేశారు. గత ఏడాదితో పోల్చుకుని చూస్తే ఈ సారి సాగు విస్తీర్ణం తగ్గింది. ఇప్పటికే బోరు బావుల్లో నీటి మట్టాలు పడిపోయాయి. రానున్న వేసవిలో మరింతగా భూగర్భ నీటి మట్టాలు తగ్గిపోయే సూచనలు మెండుగా కనిపిస్తున్నాయి. జిల్లాలో ఆలస్యంగా పంటలు సాగు చేశారు. ఇప్పటికే వరి కోతలు పూర్తి కాగా కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకున్నారు. బోరు బావులు ఉన్న రైతులు మళ్లీ వరి, కూరగాయ పంటలు సాగు చేశారు. ప్రస్తుతం భూగర్భనీటి మట్టం తగ్గిపోయి చాలా చోట బోర్లు ఆగాగి పోస్తున్నాయి. ఎండాకాలం ప్రారంభం కాకముందే కొన్నిచోట్ల బోర్లు ఎండిపోవడంతో మళ్లీ రైతులు కొత్తగా బోరు వేస్తున్నారు. కొన్నిచోట్ల పాత బోరులోనే మరింత లోతు తవ్విస్తున్నారు. ఇలాగే ఇష్టానుసారంగా బోర్లు వేస్తే రానున్న రోజుల్లో మరింత ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

పెరిగిన నీటి వినియోగం..

గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణాల్లోనే నీటి వాడకం నానాటికీ అధికమవుతూ వస్తోంది. పట్టణ ప్రాంతాల్లో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. భూగర్భ జలాలు రోజురోజుకూ అడుగంటుతున్నాయి. గతేడాది నవంబరు, డిసెంబరు నెలలో భూగర్భజల నీటి మట్టాలను పరిశీలిస్తే.. షాబాద్ మండలంలో 2.25 మీటర్ల లోతులోకి భూగర్భ జలాలు వెళ్లింది. అలాగే నరూర్‌నగర్ మండలంలో 2.15 మీటర్ల లోతులోకి నీరు వెళ్లగా.. యాచారంలో 1.75 మీటర్లు, శంకర్‌పల్లి 1.92 మీటర్లు, మంచాల 1.67 మీటర్లు, కొందుర్గు 1.50మీటర్లు, కొత్తూరు 1.04 మీటర్లు, హయత్‌నగర్ 1.49 మీటర్లు, ఇబ్రహీంపట్నం 1.64 మీటర్లు చేవెళ్ల 1.09 మీటర్లు, చౌదరిగూడెం 1.38 మీటర్ల లోతులోకి భూగర్భ జలం వెళ్లింది. విచ్చలవిడిగా నీటి వినియోగంతో భూగర్భ జలాలు అట్టడుగుకు చేరుతున్నాయి. ఎక్కడపడితే అక్కడ బోర్లువేసి భూమికి తూట్లు పొడుస్తుండటంతో గ్రామాల్లో నీటి సమస్య తలెత్తుతోంది.


నిబంధనలు గాలికి..

నీరు, చెట్టు, భూమి సంరక్షణకు పక్కాగా రూపొందించిన వాల్టా చట్టం ఉల్లంఘనకు గురవుతోంది. నిబంధనల ప్రకారం ఒక బోరు తవ్వాలంటే ముందుగా సంబంధిత శాఖ అధికారి అనుమతి తీసుకోవాలి. స్థానికంగా తహసీల్దారు అనుమతి తీసుకున్నప్పటికీ భూగర్భజల శాఖ అధికారులను సంప్రదించి బోరు వేయాల్సి ఉంటుంది. ఎడాపెడా బోర్లు వేయడం వల్ల వాల్టా చట్టం ఉల్లంఘనకు గురవుతోంది. వంట పొలాల్లో వేసే బోర్లతో పాటు ఇళ్లలో వేస్తున్న బోర్ల తవ్వకాలకు కచ్చితంగా అనుమతి తీసుకోవాలన్న నిబంధన ఉన్నప్పటికీ ఎక్కడా పాటించడం లేదు. బోరు తవ్వకం కోసం ఒక్క దరఖాస్తు కూడా రావడం లేదంటున్నారు. కానీ జిల్లాలో పదుల సంఖ్యలో బోర్లు వేస్తున్నారు.

ధరలు పెంచిన రిగ్గుల యజమానులు

బోర్లు వేసుకోవడానికి రైతులు ఆసక్తి కనబరుస్తుండటంతో రిగ్గుల యజమానులు ధరలు పెంచేశారు. డీజిల్‌తో పాటు కార్మికుల వేతనాలు పెరగడంతో రేట్లు పెంచక తప్పలేదని రిగ్గుల యజమానులు తెలిపారు. వంద ఫీట్ల వరకు ఫీటుకు రూ.70 చార్జి వేస్తున్నారు. వంద ఫీట్ల నుంచి 200 ఫీట్ల వరకు రూ.80, 200 ఫీట్ల నుంచి 300 ఫీట్ల వరకు రూ.90, 300 ఫీట్ల నుంచి 400 ఫీట్ల వరకు రూ.110 ఇలా ఫీట్ల లోతు పెరిగే కొద్ది ధరలు పెంచుతున్నారు. కాగా పాత బోర్లు ఫ్లైషింగ్ చేస్తే ఫీట్‌కు రూ.90 తీసుకుంటున్నారు. నేడు లీటర్ డీజిల్‌కు రూ.97 చేరుకోవడంతో ధరలు పెంచక తప్పలేదని రిగ్గుల యజమానులు చెబుతున్నారు.

ఎనిమిది బోర్లు వేశా.. చుక్క నీరు రాలే



ఇప్పటి వరకు ఎనిమిది బోర్లు వేశాను. చుక్క నీరు రాలేదు. బోర్లు వేసేందుకు రూ.6 లక్షలు ఖర్చు చేశాను. అప్పులు చేసి బోర్లు వేసిన. బోర్లు వేయించడానికి చేసిన అప్పులు ఎలా తీర్చాలో తోచడం లేదు. ఇంత ఘోరం గతంలో తామేనాడు చూడలేదు. ఇటీవల వరినాట్లు వేసినా అది కూడా చేతికందుతుందో లేదో అర్థమవడం లేదు.

- రావుల జంగయ్య, రైతు, చిన్నతూండ్ల

భక్తిభావాన్ని అలవర్చుకోవాలి : ఎమ్మెల్సీ

కేశంపేట, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) ప్రతి ఒక్కరూ భక్తిభావం అలవర్చుకోవాలని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని తొమ్మిదిరేకులలో మహదేవ ఆలయంలో శివపార్వతుల కల్యాణ మండల నిర్మాణానికి ఆదివారం భూమిపూజ కార్యక్రమానికి ఆయన హాజరైనారు. దైవ చింతనతో గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొంటుందని తెలిపారు. మండపం నిర్మాణానికి రూ.1,11,000/- విరాళం ప్రకటించారు. అంతకుముందు ఆలయ ఆహ్వాన కమిటీ ఎమ్మెల్సీని పూర్ణకుంభంతో పండితుల మంత్రోచ్ఛరణ మధ్య ఆహ్వానించారు. మాజీ సర్పంచ్ సావిత్రి బాల్‌రాజ్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ యాదయ్య, ప్యాక్స్ డైరెక్టర్ మధుసూదన్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు శేఖర్ పంతులు, రాంరెడ్డి, కృష్ణా రెడ్డి, నర్సింహారెడ్డి, భూపాల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, నాగిళ్ల వెంకటేష్, కృష్ణ, భాస్కర్, రాజశేఖర్, గోస్కి, నర్సింహులు, అంజనేయులు, రాములు, మల్లేష్, నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


కల్యాణ మండపం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

తాజా మాజీ కౌన్సిలర్‌కు సన్మానం



ఆమనగల్లు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): 8వ వార్డు తాజా మాజీ కౌన్సిలర్ కమటం రాధమ్మవెంకటయ్యకు అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈమేరకు పూలమాలలు, శాలువాలతో సత్కరించి వారి సేవలను కొనియాడారు. నిరంజన్, రామచంద్రయ్య, బాల్‌రాజ్, మహేశ్, మల్లేశ్, శేఖర్, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులు భారం కాకూడదు


చెక్కు అందజేస్తున్న గోలి శ్రీనివాస్ రెడ్డి

కడ్తాల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పేదల వైద్యానికి ఖర్చులు భారం కాకూడదని రాష్ట్ర ఫుడ్ కమిషనర్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆరోగ్య శ్రీ పరిధిలోకి రాని అన్ని వైద్య చికిత్సలకు ప్రభుత్వం విరివిగా సాయమందించాలని కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. నార్లకుంట తండాకు చెందిన అంగోత్ దేవ భార్య పూజకు మంజూరైన రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణకు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వసతుల కల్పనకు ప్రభుత్వాలు పెద్దపీట వేయాలన్నారు. ఆహార పదార్థాలు కల్తీచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మాజీ ఎంపీటీసీ లచ్చిరామ్ నాయక్, నాయకులు శంకర్, సుమన్‌నాయక్, శేఖర్, తిరుమలేశ్, శివ, మణి, తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఆమనగల్లు/చౌదరిగూడ/షాబాద్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కరాటే పోటీలలో ఆమనగల్లు జపాన్ కరాటే అసోసియేషన్ విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. పదేసి బంగారు, రజత, మూడు కాంస్య పతకాలు సాధించారు. హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో ఆదివారం వరల్డ్ నకాయామా షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ఆమనగల్లు పట్టణానికి చెందిన మాస్టర్ జగదీశ్వర్ ఆధ్వర్యంలో 13 మంది విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు. నిర్వాహకుడు అమర్‌సింగ్ పతకాలు, షీల్డులు బహూకరించారు. అలాగే వికారాబాద్ జిల్లాలో నిర్వహించిన 6వ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కొందుర్గు న్యూమాంక్స్ కుంగ్‌ఫూ విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చినట్లు మాస్టర్ రమేష్ తెలిపారు. షాబాద్ మండలం లక్ష్మారావుగూడకు చెందిన మేకల జ్ఞానతేజ మొయినాబాద్ మండలం సుజాత స్కూల్‌లో 3వ తరగతి చదువుతుంది. చదువుతోపాటు గ్లోయింగ్ షోటోకాన్ కరాటే అకాడమీలో శిక్షణ పొందుతోంది. ఆదివారం ఏపీలోని వైజాగ్‌లో జరిగిన 8వ ఇంటర్‌నేషనల్ కరాటే చాంపియన్‌షిప్‌లో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించింది. ఈమేరకు ప్రిన్సిపాల్‌తో పాటు కరాటే మాస్టర్ సియాన్.కె.సుధాకర్, తల్లిదండ్రులు, మేకల ప్రభావతి-విజయ్‌శేఖర్, పెదనాన్న-పెద్దమ్మ మేకల శ్రీనివాస్, సరిత మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.


రాధికను సన్మానిస్తున్న నాయకులు

'పార్టీని బద్నాం చేసే కుట్ర'

- బీజేపీ మాజీ మండలాధ్యక్షుడు రఘురాములు గౌడ్

కేశంపేట, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కొందరు పదవి ఆశించి తమకు పదవి రాకపోయే సరికి పార్టీని బద్నాం చేసే కుట్ర చేస్తున్నారని, అందులో భాగంగానే పార్టీ పదవులకు రాజీనామాలంటూ నాటకానికి తెరతీసారని బీజేపీ కేశంపేట మండల మాజీ అధ్యక్షుడు రొల్ల రఘురాములు గౌడ్ అన్నారు. మండలానికి ఇటీవల అధ్యక్షురాలిగా ఎన్నికైన రొల్ల రాధికను ఆదివారం శారద గార్డెన్స్‌లో పార్టీ నాయకులు సన్మానించారు. రఘురాములు మాట్లాడుతూ రాష్ట్ర నాయకత్వం నియోజకవర్గానికి మహిళను అధ్యక్షురాలిని ఎన్నిక చేయాలని నిర్ణయించిందని తెలిపారు. నాయకులు మధుసూదన్‌గౌడ్, ఉదయ్‌కుమార్ గౌడ్, యుగేందర్, తట్టిపల్లి శాంభవి, సరిత, శ్రీలత, మోటే శ్రీనివాస్, నరసింహ, తట్టిపల్లి నర్సింహ, పల్లె అశోక్, రావుల శ్రీనివాస్, రాకేష్ ముదిరాజ్, బీజేవైఎం మండలాధ్యక్షుడు పాలాది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

తలకొండపల్లి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): చుక్కాపూర్ గ్రామానికి చెందిన కాగుల యాదయ్యకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో మంజూరైన రూ.37,500 సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆదివారం చుక్కాపూర్ గ్రామంలో బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు అందజేశారు. మాజీ ఎంపీటీసీ యాదయ్య, ఉపసర్పంచ్ జక్కు శ్రీనివాస్ రెడ్డి, కుమార్ యాదవ్, యాదయ్య, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి : ఎమ్మార్పీఎస్

కడ్తాల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాల నుంచి ఎస్సీ వర్గీకరణ కొరకై ఉద్యమిస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఫిబ్రవరి 7న చలో హైదరాబాద్‌కు సంబంధించి ఆదివారం కడ్తాల మండలం కేంద్రంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమం విజయవంతం గురించి చర్చించారు. సభకు సంబంధించి రూపొందించిన కరపత్రాలు, వాల్‌పోస్టర్లను ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కిరణ్‌పూలే, కడ్తాల మండలాధ్యక్షుడు రమేశ్, శ్రీకాంత్, నాయకులతో కలిసి రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహ ఆవిష్కరించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అమలుచేయాలన్నారు. బీజేపీ మండలాధ్యక్షుడు మహేశ్, నరేశ్, లక్ష్మమ్మ లాయక్‌అలీ, పాండు నాయక్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.


మాడ్గుల : ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మాడ్గుల : లక్ష డప్పులు, వేల గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి కట్ట జగన్ పిలుపునిచ్చారు. ఇర్విన్‌లో ర్యాలీ నిర్వహించారు. కట్ట చిత్తరంజన్, ఒగ్గు మల్లేశ్, బిక్కయ్య, మహేష్ ఉన్నారు.

ఇబ్రహీంపట్నం : వేయి గొంతులు, లక్ష డప్పుల సాంస్కృతిక ప్రదర్శనను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సిద్దాపురం శ్రీకాంత్ మాదిగ కోరారు. ఇబ్రహీంపట్నంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద కార్యక్రమానికి సంబంధించి వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యుడు బోసుపల్లి ప్రతాప్, ఎమ్మార్పీఎస్ నాయకులు సతీష్, మహేష్, సుధాకర్, అయోధ్య, యాదయ్య, మల్లేష్, బాబు, జంగయ్య, నర్సింహ తదితరులున్నారు.

కేశంపేట : ఎమ్మార్పీఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో కాకునూర్‌లో లక్షల డప్పులు, వేయి గొంతులు వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. మండలాధ్యక్షుడు చిర్ర శ్రీను నేతృత్వంలో కాకునూర్‌కు తరలివెళ్లి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. దశరథ్, గ్యార సురేష్, పందిలింగం, భీమయ్య, పోలేపోగు మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీలు


నియామక పత్రాలు అందిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చేవెళ్ల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ బలోపేతం కోసం నూతన కమిటీలు వేయడం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి బ్యాతల శివశంకర్, చేవెళ్ల మండలాధ్యక్షుడు ఊరెంట ప్రవీణ్‌కుమార్ మాదిగ తెలిపారు. ఆదివారం చేవెళ్ల మండల పరిధిలోని మల్కాపూర్, ఖానాపురం తదితర గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీలు చేశారు. వారు మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో ఎమ్మార్పీఎస్‌ను బలోపేతం చేస్తామన్నారు. మల్కాపూర్ అధ్యక్షుడిగా గండు శాంతికుమార్, ఉపాధ్యక్షుడిగా గండు ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా మహేందర్, కార్యదర్శులుగా జయరాజ్, సుధాకర్, అధికారి ప్రతినిధిగా అమృతరాజ్, కోశాధికారి నాగేందర్, ఖానాపురం అధ్యక్షుడిగా గజ్జగని జశ్వంత్, ఉపాధ్యక్షుడిగా మాణిక్యం, ప్రధాన కార్యదర్శిగా ఎం.శ్రీనివాస్, హరిప్రసాద్, అధికారి ప్రతినిధిగా ఎం.నర్సింహ, కోశాధికారిగా వెంకటేష్, మీడియా కన్వీనర్‌లుగా ప్రకాశ్ తదితరులను ఎంపిక చేశామన్నారు. రమేశ్, అనంతరాములు, తదితరులు ఉన్నారు.

పశుగ్రాసం దగ్ధం

యాచారం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : వృథాగా ఉన్న పంటపొలాల్లో ఏపుగా పెరిగిన పశుగ్రాసం అగ్నికి ఆహుతైన ఘటన చిన్నతూండ్లలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. చిన్నతూండ్ల నుంచి బాషమోనిగూడ వెళ్లే దారిలోని పంటపొలాల్లో పశుగ్రాసం ఏపుగా పెరిగింది. దాంతో రైతులు పాడిపశువులను మేపుకునేవారు. ఆదివారం ఉదయం 8గంటల సమయంలో గ్రామానికి చెందిన పలువురు రైతులు పశువులను మేపుకునేందుకు వెళ్లగా గడ్డి కాలిపోయి పొగరావడం చూసి కన్నీరు మున్నీరుగా రోదించారు. హైటెన్షన్ వైర్ల నుంచి నిప్పులు పడి మంటలు వచ్చి ఉండవచ్చని రైతులు అనుమానిస్తున్నారు. గుర్తుతెలియని దుండగులు ఆదివారం తెల్లవారుజామున నిప్పంటించడంతో పశుగ్రాసం పూర్తిగా కాలిపోవచ్చని మరికొందరు రైతులు తెలిపారు. కాగా, పశువుల దాణాకు ఇబ్బందిగా ఉంటుందని, తమకు ప్రభుత్వం ఆర్థికంగా సాయం చేసి ఆదుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

కేంద్ర బడ్జెట్‌పై సీపీఎం భగ్గు


ఇబ్రహీంపట్నం : కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ల ప్రయోజనాలకు ఉపయోగపడేలా ఉందని సీపీఎం ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి సీ.హెచ్.బుగ్గరాములు ఆరోపించారు. నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను నిరసిస్తూ ఆదివారం ఇబ్రహీంపట్నంలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజలకు లబ్ధి చేకూరేట్టుగా బడ్జెట్ లేదన్నారు. భారత బీమా రంగంలో వందశాతం విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తూ దేశీయ సంస్థల ఉనికిని ప్రమాదంలో పడేశారన్నారు. వ్యవసాయ రంగానికి కేటాయింపులు తక్కువగా ఉన్నాయన్నారు. విద్య, వైద్య రంగాలకు ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించలేదన్నారు. తెలంగాణకు నిధులు కేటాయించకపోవడం కేంద్రం వివక్ష కాదా అంటూ ప్రశ్నించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సీ.హెచ్.జంగయ్య, మున్సిపల్ కార్యదర్శి ఎల్లేష్, నాయకులు టీనర్సింహ, పురుషోత్తం, వీరేషం, స్వప్న, యాదగిరి, వంశీ, చరణ్, తరంగ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడిదారుల బడ్జెట్

యాచారం : కేంద్ర ప్రభుత్వం భూస్వాములు, బడా పెట్టుబడిదారులక అనుకూలంగా ఉందని, పేదలకు ఎలాంటి లాభం లేకుండా పోయిందని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహులు విమర్శించారు. బడ్జెట్‌కు నిరసనగా మండల కేంద్రంలో సీపీఎం కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. నిరుద్యోగ సమస్య నిర్మూలనకు పరిష్కారం చూపలేదన్నారు. నాయకులు జగన్, ఎంజే వినోద్, బాలరాజ్, పి.అంజయ్య, లాజర్, చందూనాయక్, విప్లవ్‌కుమార్, జంగయ్య, ఎం.అరుణ, ఉమా తదితరులున్నారు.

తెలంగాణకు తీవ్ర అన్యాయం

ఆమనగల్లు : తెలంగాణ ప్రభుత్వం నిధులు కేటాయించాలని ఎన్నో ప్రతిపాదనలు ఇచ్చినా కేంద్ర బడ్జెట్‌లో నిధులు దక్కలేదని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పలు ప్రాజెక్ట్‌లకు, పథకాలకు నిధులు ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా మోదీకి విన్నవించినా తెలంగాణకు బడ్జెట్‌లో మొండిచెయ్యి చూపారన్నారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణకు ఈసారి కూడా బడ్జెట్‌లో నిరాశే మిగల్చిందన్నారు. ఎన్నికలు ఉన్న రాష్ట్రాలకే పెద్దపీట వేస్తున్నారన్నారు. దేశ వ్యాప్తంగా నిరుద్యోగం పెరుగుతున్న, ఉద్యోగ, ఉపాధి కల్పనలో మోదీ ప్రభుత్వం విఫలమైందన్నారు. తెలంగాణ అభివృద్ధి పట్ల బీజేపీ ఎంపీలకు చిత్తశుద్ధి లేదన్నారు. మండలాధ్యక్షుడు జగన్, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఖలీల్, జిల్లా నాయకులు ఉన్నారు.

విద్యారంగానికి మొండిచేయి

చేవెళ్ల : కేంద్రం బడ్జెట్‌లో విద్యారంగానికి మొండిచేయి చూపించిందని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అరుణ్ కుమార్ తెలిపారు. చేవెళ్లలో మీడియాలో మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి పెద్దపీట వేయలేదని, గతం కంటే ఈసారి విద్యా రంగానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించడంలో పూర్తిగా విఫలమైందన్నారు.

ఆడపిల్లలకు అండగా ఉందాం

షాబాద్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలకు అండగా ఉందామని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీరాంరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామంలో ఆడపిల్ల పుట్టిన దంపతులకు రూ.5,211 ఆర్థిక సాయం అందజేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలు పుట్టిన తల్లిదండ్రులకు అండగా ఉందామని అన్నారు. ఇప్పటివరకు గ్రామంలో 18 మందికి ఆర్థిక సాయం అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సత్తయ్య, దేవేందర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, మల్లేష్, మహేందర్, రాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు

కడ్తాల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కడ్తాల లక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ప్రజాప్రతినిధులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు, నాయకులు కోరారు. ఆదివారం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఆలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. వేడుకల ఏర్పాట్లపై చర్చించారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించి రూపొందించిన కరపత్రాలు, వాల్‌పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. ఈనెల 8నుంచి 14వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈవో మోహన్‌రావు, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ అంజనేయులు, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, నాయకులు చేగూరి వెంకటేశ్, కడారి రామకృష్ణ, బీచ్యానాయక్, చందోజీ, నరేందర్ రెడ్డి, యాదయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఆమనగల్లు : ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని కడ్తాల, మాడ్గుల, ఆమనగల్లు, తలకొండపల్లి మండలాలకు రెండో విడత 272 కాటమయ్య రక్షణ కిట్లు మంజూరైనట్లు ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ తెలిపారు. మొదటి విడతలో 75 మంది గీత కార్మికులకు కిట్లు అందజేసినట్లు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

ఆమనగల్లు : యువత ఉపాధి పథకాలు ఏర్పాటు చేసుకొని స్వశక్తితో ఎదగాలని టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డిలు అన్నారు. ఆమనగల్లు పట్టణంలో ఫరీద్ ఏర్పాటుకున్న స్వయం ఉపాధి పథకాన్ని సోమవారం ఆమనగల్లు కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మండల అధ్యక్షుడు జగన్‌లతో కలిసి అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డిలు ప్రారంభించారు. నాయకులు కృష్ణనాయక్, ఖలీల్, అలీమ్, బీచ్యానాయక్, నాజర్, ఖాదర్, మహేశ్, రహీం తదితరులున్నారు.

తలకొండపల్లి : మండల కేంద్రం ఏర్పాటు కోసం ఎంతటి పోరాటానికైన వెనుకాడబోమని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్‌లో ఆమోదించిన 11 కొత్త మండలాల జాబితాలో గట్టిప్పలపల్లి పేరు లేకపోతే ఆమరణ నిరహార దీక్ష చేపడుతామని హెచ్చరించారు. గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలోచేపట్టిన రిలే నిరహార దీక్షలు ఆదివారం 94వ రోజుకు చేరాయి. దీక్షల్లో జేఏసీ నాయకులు, మహిళలు , యువకులు, వివిధ సంఘాల నేతలు పాల్గొన్నారు.